క్లుప్తంగా

నేటి నుంచి వార్షిక పరీక్షలు

కాగజ్‌నగర్‌రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్‌లో అడ్మిషన్ తీసుకున్న 2వ సంవత్సరం సెమిస్టర్-4 విద్యార్థులకు బుధవారం నుంచి వార్షిక పరీక్షలు నిర్వహించనున్నట్లు కోఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ తెలిపారు. పరీక్షలు రాసే విద్యార్థులు హాల్‌టికెట్‌తో పాటు ఒరిజినల్ ఆధార్‌కార్డు లేదా ఇతర గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలని సూచించారు.

ఉపాధ్యాయుల కృషి అభినందనీయం



సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కెరమెరి: గోయగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గడిచిన కొన్నేళ్లుగా పాఠశాల అభ్యున్నతికి, విద్యాభివృద్ధికి చేసిన కృషి అభినందనీయమని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, హెచ్‌ఎం, మండల నోడల్ అధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. ఇటీవల బదిలీలు, పదోన్నతులపై వెళ్లిన ఉపాధ్యాయులు విజేశ్, మురళి, గణేశ్, విజయ, స్వప్నలకు మంగళవారం గోయగాంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కెరమెరి, ఝరి కాంప్లెక్స్ హెచ్‌ఎంలు చంద్రశేఖర్, భరత్, గోయగాం ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగికి విరమణ సహజం



సన్మానిస్తున్న డీఈవో అశోక్

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సహజమని డీఈవో అశోక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన చరణ్‌ను జెడ్పీటీసీ నాగేశ్వర్ రావు, ఎంపీపీ మల్లికార్జున్‌తో కలిసి సన్మానించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నత స్థానానికి తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్ బాబు, హెచ్‌ఎం సుభాష్, టీచర్లు ఊశన్న, హేమంత్, రమేశ్ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కౌటాల: మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నస్రుల్లాఖాన్ తెలిపారు. నేడు ఉదయం 10 గంటలకు ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు



గుప్తనిధుల కోసం తవ్విన గుంత

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం గ్రామంలోని పురాతన వేంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు తెలుస్తోంది. ఆలయ సమీపంలో పెద్ద గుంత తవ్వి కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. గతంలో కూడా ఈ ప్రాంతంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టారని ప్రచారం జరుగుతోంది.

సృజనాత్మకత పెంపొందించుకోవాలి

ఇచ్చోడ: ఫొటో, వీడియో గ్రాఫర్లు ప్రస్తుతం ఉన్న టెక్నాలజీ అందిపుచ్చుకుంటూ మరింత సృజనాత్మకత పెంపొందించుకొని వృత్తిలో రాణించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు దోడ అశోక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన జిల్లా, డివిజన్ కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. కుటుంబ భరోసా పథకంలో భాగంగా రూ.10 చెల్లించాలని, ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు తక్షణ సాయంగా రూ.10వేలతో పాటు ప్రమాద బీమా రూ.లక్ష అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, ప్రవీణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేశ్, రాష్ట్ర కార్యదర్శి విజయ్, అజయ్ పాల్గొన్నారు.

ఓవర్ లోడ్‌తో రోడ్లు ధ్వంసం

- ఇసుక ట్రాక్టర్లు, కంకర టిప్పర్లతో ప్రమాదాలు
- ఛిద్రమవుతున్న తారురోడ్లు
- పట్టించుకోని అధికారులు



కౌటాలలోని తలోడి చౌరస్తాలో ధ్వంసమైన డబుల్ రోడ్డు



కౌటాల - విజయనగరం ప్రధాన రహదారిపై ఓవర్‌లోడ్‌తో కంకర తరలిస్తున్న టిప్పర్లు

కౌటాల: జిల్లాలో వాహనాలు అతివేగం, అధిక లోడుతో ఇష్టారాజ్యంగా దూసుకుపోతుండడంతో అమాయక ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. కంకర క్వారీ యజమానులు పొరుగు రాష్ట్రాలకు కంకర తరలించే క్రమంలో గ్రామీణ ప్రజలు టిప్పర్ల చక్రాల కింద నలిగిపోతున్నారు. విద్యుత్ గుత్తేదారులు సైతం ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండా వాహనాల్లో అధిక లోడుతో విద్యుత్ స్తంభాలు, సామగ్రి తరలిస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని ముత్తంపేట శివారులోని కంకర క్రషర్ కంపెనీలు రాత్రి, పగలు తేడా లేకుండా అధిక లోడుతో టిప్పర్లలో కంకర తరలిస్తున్నారు. అలాగే వాగులు, నదుల నుంచి అక్రమంగా ఓవర్ లోడుతో ఇసుక తరలిస్తున్న క్రమంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు బాధిత కుటుంబాలకు కొంతమేర నష్టపరిహారం చెల్లించి యజమానులు చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఓవర్ లోడ్..

కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల్లో నిత్యం ఓవర్‌లోడ్‌తో భారీ వాహనాలు రాకపోకలు కొనసాగుతున్నాయి. ఈ వాహనాలు రవాణా, మైనింగ్ శాఖ నిబంధనలు పాటించడం లేదు. 10 టైర్లు ఉన్న లారీ 20 టన్నులతో వెళ్లాల్సి ఉండగా 25 నుంచి 26 టన్నులు, 12 టైర్ల లారీ 26 టన్నులతో వెళ్లాల్సి ఉండగా సుమారు 32 టన్నులకు పైగానే ఓవర్ లోడ్‌తో వెళ్తున్నాయి. ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ ఢీ కొని రెండేళ్ల క్రితం మండలంలోని యాపలగూడ గ్రామంలో నాలుగేళ్ల చిన్నారి మృత్యువాత పడింది. ట్రాక్టర్లలో సైతం నిర్దిష్ట ప్రమాణాల కంటే ఎక్కువ టన్నులు లోడింగ్ చేయడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

అధ్వానంగా రోడ్లు..

మండలంలోని ముత్తంపేట నుంచి పార్డీ గ్రామానికి వెళ్లే మార్గంలో నాలుగు కంకర క్వారీలు, క్రషర్లు ఉండటంతో నిత్యం వందలాది భారీ వాహనాలు కంకర లోడ్‌తో రాకపోకలు సాగిస్తున్నాయి. ఇక్కడి నుంచి నాలుగు వరుసల రహదారికి అవసరమైన కంకరను తరలించడంతో కాగజ్‌నగర్, కౌటాల, తలోడి, సిర్పూర్(టి), ముత్తంపేట, పార్డీ గ్రామాల వద్ద ప్రధాన రహదారి అనేక చోట్ల గుంతలమయంగా మారింది. ఓవర్ లోడ్ కారణంగా కొత్తగా వేసిన రోడ్లు సైతం పగుళ్లు తేలుతున్నాయి. పరిమితికి మించి కంకరతో గ్రామీణ రోడ్ల గుండా లారీలు వెళ్తుండటంతో గ్రామీణులు దుమ్ముతో శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. జిల్లాలోని క్వారీల నుంచి గనుల శాఖకు ఏటా రూ.కోట్లలో ఆదాయం వస్తుంది. ఈ నిధులు క్వారీలు ఉన్న ప్రాంతాల్లో రహదారులు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించాలి. కానీ నయాపైసా వినియోగించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

జాడలేని తనిఖీలు..

వాహనాల రాకపోకలపై, ఓవర్ లోడింగ్‌పై నిరంతరం పర్యవేక్షణ చేయాల్సిన రవాణ శాఖ, మైనింగ్, ఇతర సంబంధిత శాఖ అధికారులు నిద్రావస్థలో ఉన్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో ప్రమాదాలు జరిగాక, ప్రాణాలు కోల్పోయాక నామమాత్రంగా తనిఖీలు నిర్వహిస్తూ, జరిమానాలు విధిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కంకరను తరలించే భారీ వాహనాలు పరిమితికి మించి లోడ్‌తో వెళ్తుండటంతో రూ.కోట్ల నిధులతో వేసిన ప్రధాన రహదారులు ఛిద్రమవుతున్నాయి. లారీ డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వాహనాలను నడుపుతూ ప్రాణాలు తీస్తున్నా అధికారులు 'మామూలు'గా తీసుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఓవర్‌లోడ్‌తో ప్రమాదకరంగా వెళ్తున్నవాహనాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఏళ్లుగా తిప్పలు..



ముత్తంపేట -పార్డీ రోడ్డుపై నుంచి నిత్యం వందల సంఖ్యలో కంకర టిప్పర్లు రాకపోకలు కొనసాగిస్తుండడంతో రోడ్డుపై భారీ గుంతలు పడ్డాయి. దీంతో మా గ్రామానికి అంబులెన్స్ కూడా రాలేని దుస్థితి నెలకొంది. ఈ రోడ్లతో రైతులు, విద్యార్థులు, వృద్ధులు, గర్భిణీలు, మహిళలకు ఇబ్బందులు తప్పడం లేదు. బీటీ రోడ్డు వేసి ఏళ్లుగా ఉన్న సమస్య పరిష్కరించాలి.

– డి.సంజీవ్, పార్డి, కౌటాల

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న అనిత

కాగజ్‌నగర్‌రూరల్: భారత సేవాశ్రమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. స్వామి మునీశ్వరానందాజి, సరస్వతీ శిశుమందిరాల జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ కొత్తపల్లి అనిత విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రతన్‌గైన్, పోతురాజుల లక్ష్మణ్, హనుమండ్ల రాజన్న, అరుణ్ లోయా, శ్రీనివాస్, ఇందూరి వెంకటేశం, పాల్గొన్నారు

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నవీన్

కెరమెరి: నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేవైఎం మండలాధ్యక్షుడు అలుగొట్టు నవీన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ దత్తుప్రసాద్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలకు పైగా గడుస్తున్నప్పటికీ నేటికీ నిరుద్యోగుల సమస్యలపై ఎలాంటి స్పందన లేదన్నారు. నాయకులు కిషన్, శంకర్, దొండిరామ్, అనిల్‌కుమార్, బాలాజి, దుర్గాదాస్, గబ్బర్‌సింగ్ తదితరులు ఉన్నారు.

నిరుద్యోగుల సమస్యలపై వినతి..



వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

పెంచికల్‌పేట్: నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం బీజేవైఎం మండల అధ్యక్షుడు పాలె సంతోష్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెగా డీఎస్సీ ప్రకటించాలని, జీవో 46 రద్దు చేయడంతో పాటు, నియామకాల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నాయకులు బాపూజీ, కాంతారావు, పురుషోత్తం, తెలిగే రమేశ్, దివాకర్ పాల్గొన్నారు.

వర్షంతో ఇబ్బందులు



దహెగాం: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. మండల కేంద్రంలో వార సంత కావడంతో వర్షానికి చిరు వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షపు నీరు మార్కెట్ ప్రాంతంలో చేరడంతో కూరగాయలు, బట్టలు తడిచిపోయాయని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. కూరగాయలు వర్షపు నీటిలో తేలడంతో కొనుగోలు చేయడానికి ప్రజలు ఆసక్తి చూపలేదు. మరోవైపు ఈ వర్షం పత్తి మొక్కలకు జీవం పోసిందని పలువురు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రైతుల అభిప్రాయ సేకరణ

తిర్యాణి: రైతుభరోసా పథకం అమలుపై మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించి రైతుల అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి తిరుమలేశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు రైతుల అభిప్రాయాలు సేకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, వివిధ గ్రామల రైతులు పాల్గొన్నారు.

'అంత్యక్రియల్లో వివక్ష'

నార్నూర్: బడుగు బలహీన వర్గాల ఆత్మబంధువు మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించకుండా వివక్ష చూపారని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్ రెడ్డి నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎస్ అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించిన ప్రభుత్వం గిరిజన బిడ్డ రాథోడ్ రమేశ్ అంత్యక్రియలను పట్టించుకోలేదన్నారు.

దొంగను పట్టుకొని పోలీసులకు అప్పగింత

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని కాపువాడ రైల్వేస్టేషన్ రోడ్డులో గల ఓ కిరాణా దుకాణంలో మంగళవారం రాత్రి దొంగతనం చేసిన యువకుడిని కాలనీవాసులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మద్యం మత్తులో ఉన్న యువకుడు దొంగతనం చేసి పారిపోతుండగా, హోటల్ యజమానితో పాటు కాలనీకి చెందిన కొంత మంది యువకులు వెంబడించి పట్టుకున్నారు. కౌన్సిలర్ జయచందర్ పోలీసులకు సమాచారం అందించగా, సంఘటన స్థలానికి చేరుకొని యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈవిషయమై పట్టణ సీఐ శంకరయ్యను సంప్రదించగా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

బోథ్: రాష్ట్ర మంత్రి వర్గంలో విద్యాశాఖకు మంత్రి లేకపోవడంతో విద్యావ్యవస్థ కుంటుపడిందని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి లాడేవార్ తుకారాం అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడిచినా విద్యాశాఖకు మంత్రి లేడన్నారు.

అంగన్వాడీ టీచర్లకు శిక్షణ ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీడీపీవో

నార్నూర్: అంగన్వాడీ కేంద్రాల్లో ప్రాథమిక విద్య పిల్లలకు పునాది వంటిదని సీడీపీవో శారద అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని విజయనగర్ కాలనీలోని శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ కమ్యూనిటీ భవన్‌లో అంగన్వాడీ టీచర్లకు మూడు రోజులపాటు శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో చదివే విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో విద్యాబోధనపై అంగన్వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పిల్లలకు సులభమైన విధానంలో ఆటపాటల ద్వారా విద్య అందించే కార్యక్రమంపై దశలవారీగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మి, వందన, ఉమా, ప్రదీపిక తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

పెంచికల్‌పేట్: వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పెంచికల్‌పేట్ ఎంపీడీవో అల్బర్ట్ అన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వానా కాలంలో పారిశుధ్య లోపంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామాల్లో వైద్య సిబ్బంది ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. గర్భిణులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీవో గంగాసింగ్, వైద్యురాలు ఆరీష్‌న్, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోవ లక్ష్మిపై కఠిన చర్యలు తీసుకోవాలి



జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రెబ్బెన: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే కోవ లక్ష్మిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట జాతీయ రహదారిపై కాంగ్రెస్ నాయకులు రాస్తారోకో చేశారు. వారు మాట్లాడుతూ ఆదివాసీ మహిళగా ఎమ్మెల్యే కోవ లక్ష్మిని నియోజకవర్గ ప్రజలు ఓట్లు వేసి గెలిపించారని, ఎమ్మెల్యేగా ఉన్నత పదవిలో ఉండి విచక్షణారహితంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిని దుర్భాషలాడటం సరికాదన్నారు. కోవ లక్ష్మిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కాగా సీఐ చిట్టిబాబు కాంగ్రెస్ నాయకులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. రాస్తారోకో కారణంగా రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు కొంతసేపు ఇబ్బందులకు గురయ్యారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవాజీ, నాయకులు కిషన్‌గౌడ్, చిరంజీవిగౌడ్, ఆత్మారాం నాయక్, మురళీ, రవీందర్, వెంకన్న, సురేందర్‌రాజు పాల్గొన్నారు.

సమాచార 'వేదిక'



జన్కాపూర్‌లోని రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్న రైతులు(ఫైల్)

- జిల్లాలోని మూడు రైతు వేదికల్లో 'రైతు నేస్తం'
- ప్రతీ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సలహాలు
- రైతులకు పంటల సాగుపై అవగాహన
- త్వరలో మరో 12 కేంద్రాల్లో వీసీ సేవలు

ఆసిఫాబాద్‌రూరల్: ఎంతో ఆర్భాటంగా నిర్మించిన రైతువేదికలు ఏళ్లుగా నిరాదరణకు గురవుతున్న విషయం తెలిసిందే. చాలాచోట్ల గ్రామాలకు దూరంగా నిర్మించడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రైతువేదికలను అన్నదాతలకు మరింత అందుబాటులోకి తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఎంపిక చేసిన రైతువేదికల్లో రైతుల కోసం వీడియో కాన్ఫరెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. వ్యవసాయ శాఖ మంత్రితోపాటు శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు రైతులకు సలహాలు, సూచనలు అందించేవిధంగా ప్రతీ మంగళవారం రైతు నేస్తం పేరిట కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో మూడు కేంద్రాల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. త్వరలో మిగిలిన రైతువేదికల్లో సైతం వీడియో కాన్ఫరెన్స్ సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

అన్నదాతలకు సలహాలు, సూచనలు

జిల్లాలో మొత్తం 70 వ్యవసాయ క్లస్టర్ల పరిధిలో 70 రైతువేదికలు నిర్మించారు. ఒక్కో దానికి దాదాపు రూ.12 లక్షల వరకు ఖర్చు చేశారు. వ్యవసాయానికి సంబంధించిన సలహాలు, సూచనలు రైతులకు వేగంగా అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సేవలు ప్రారంభించింది. ఈ సేవలు మార్చి 6 నుంచి అందుబాటులోకి వచ్చాయి. అప్పటి నుంచి ప్రతీ మంగళవారం పంటలు వేసుకునే సమయం నుంచి ఎలాంటి విత్తనం ఎంపిక చేసుకోవాలి.. విత్తన శుద్ధి, ఎరువుల వినియోగం, యాజమాన్య పద్ధతులు, పంట రైతుల చేతికందే వరకు తీసుకునే జాగ్రత్తలను రాష్ట్ర స్థాయి అధికారులు వివరిస్తున్నారు. శాస్త్రవేత్తలతో నేరుగా మాట్లాడి సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. దీని కోసం జిల్లాలో ఎంపిక చేసిన మూడు రైతు వేదికల్లో ప్రొజెక్టర్, సౌండ్ సిస్టం తదితర ఏర్పాట్లు చేశారు.

త్వరలో అన్ని కేంద్రాల్లో..

జిల్లాలోని 70 రైతువేదికల్లో ప్రస్తుతం జైనూర్, ఆసిఫాబాద్ మండలం జన్కాపూర్, సిర్పూర్(టి)లోని రైతువేదికలను రైతునేస్తం కేంద్రాలు తీర్చిదిద్దారు. ఇక్కడ ప్రస్తుతం ప్రతీ మంగళవారం ఏఈవోలు రైతులకు ముందస్తుగా సమాచారం అందించి వీడియో కాన్ఫరెన్స్‌కు తీసుకువస్తున్నారు. రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, పరిశోధన సంస్థల శాస్త్రవేత్తలు, నిపుణులతో అవగాగాహన, శిక్షణ అందిస్తున్నారు. వీటిల్లో ఎల్‌ఈడీ తెర, వీడియో కెమెరాలు, సౌండ్ సిస్టం ఏర్పాటు చేశారు. ఇటీవల వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సైతం జన్కాపూర్ రైతువేదిక నుంచి ఓ రైతుతో నేరుగా మాట్లాడారు. మిగిలిన 12 మండలాల్లోని 67 రైతువేదికల్లోనూ వీడియో కాన్ఫరెన్స్ సేవలు అందుబాటులోకి తీసుకువస్తామని వ్యవసాయశాఖ ప్రకటించింది. ఇందుకోసం ఒక్కో రైతువేదికకు రూ.3లక్షల వరకు నిధులు కేటాయించారు. పరికరాల బిగింపు పనులు కొనసాగుతున్నాయి.

ప్రతీ వారం 'రైతునేస్తం'



జిల్లాలోని మూడు రైతువేదికల్లో మార్చి 6 నుంచి రైతు నేస్తం కార్యక్రమం ప్రతీ మంగళవారం కొనసాగుతోంది. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటల సాగు విధానాలు, ఎరువుల వినియోగం, చీడ పీడల నివారణ, సేంద్రియ సాగు పద్ధతులు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. త్వరలో మిగిలిన 12 మండలాల్లోనూ సేవలు అందుబాటులోకి వస్తాయి. రైతులు ఎలాంటి సందేహాలు ఉన్న నిపుణులతో మాట్లాడి నివృత్తి చేసుకోవాలి.

– శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి